క్లుప్తంగా

ఎల్లమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు

జడ్చర్ల: స్థానిక విద్యానగర్ కాలనీలో రేణుక ఎల్లమ్మ ఆలయంలో 5వ వార్షికోత్సవం సందర్భంగా అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అభిషేకం. హోమం, తదితర ప్రత్యేక పూజల అనంతరం నైవేద్యం సమర్పించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ప్రశాంత్‌రెడ్డి, గోపాల్‌గౌడ్, మధు, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

జడ్చర్ల: మండల పరిధిలోని మీనాంబరం ఆలయం ప్రాంగణంలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. వీరంతా జడ్చర్లలో (1972–73)లో 10వ తరగతి పూర్తిచేశారు. ఆత్మీయం సమ్మేళనం సందర్భంగా అలనాటి జ్ఞాపకాలను నెమరేసుకుని ఆనందంగా గడిపారు.

పోమాల్ సర్పంచ్‌కు చేయూత

నవాబుపేట: పోమాల్ సర్పంచ్ కృష్ణ అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. దీంతో ఆయనకు వైద్య ఖర్చుల నిమిత్తం మండల సర్పంచ్‌లు రూ. 50 వేలు పోగు చేసి ఆర్థికసాయాన్ని ఆదివారం అందించారు. నవాబుపేట సర్పంచ్ గోపాల్‌గౌడ్, కొండాపూర్ సర్పంచ్ యాదయ్య, లోకిరేవు సర్పంచ్ సత్యం తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

అడ్డాకుల: మండలంలోని శాఖాపూర్ గ్రామానికి చెందిన గోద సత్యన్నగౌడ్ మృతి చెందడంతో బాధిత కుటుంబాన్ని జెడ్పీటీసీ సభ్యుడు ఎస్.రాజశేఖర్‌రెడ్డి ఆదివారం పరామర్శించారు. మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. అదేవిధంగా అదే గ్రామానికి చెందిన నాగన్న, పుష్పమ్మ, సాయమ్మలు ఇటీవల మృతి చెందడంతో వారి కుటుంబాలను కూడా పరామర్శించారు. అనారోగ్యంతో బాధపడుతున్న కోటమ్మ ఇంటి వద్దకు వెళ్లి ఆరోగ్య పరిస్థితి గురించి వాకబు చేశారు. కార్యక్రమంలో సర్పంచుల సంఘం అధ్యక్షుడు జయన్నగౌడ్, నాగరాజు, యాదయ్య, విష్ణువర్ధన్ రెడ్డి, రాజేందర్, ప్రసాద్, సాయిరాం, భాస్కర్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

మిత్రుని కుటుంబానికి ఆర్థికసాయం

మిడ్జిల్: మండల పరిధిలోని మసిగొండ్లపల్లి గ్రామానికి చెందిన తిరుపతి మృతిచెందగా(ఆత్మహత్య) బాధిత కుటుంబానికి అతడి స్నేహితులు అండగా నిలిచారు. అతడితో పాటు (2006–2007లో) పదోతరగతి చదివిన స్నేహితులు రూ. 35వేల నగదు పోగు చేసి వారికి ఆదివారం బాధితకుటుంబానికి అందజేశారు.

నేడు సీతారామ కల్యాణం



దేవరకద్ర: పట్టణంలోని ప్రసన్న ఆంజనేయ స్వామి దేవాలయంలో సోమవారం ఉదయం రామనామ సంకీర్తన కార్యక్రమం ఉంటుందని తరువాత సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్నట్లు వీహెచ్‌పీ నాయకులు తెలిపారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాదాల పంపిణీ ఉంటుందని పేర్కొన్నారు. అనంతరం సీతారాముల ఉత్సవ విగ్రహాలతో పట్టణంలో శోభాయాత్ర జరుగుతుందని తెలిపారు. సాయంత్రం మహామంగళ నీరాజనం నిర్వహించి దేవాలయం వద్ద దీపాలను వెలిగిస్తామని, ప్రతి ఒక్కరు సంప్రదాయ దుస్తులతో హాజరు కావాలని కోరారు.

ఇంటింటిపై ఎగిరిన కాషాయ జెండాలు

దేవరకద్రలో ఇంటింటిపై కాషాయ జెండాలు రెప రెపలాడాయి. సోమవారం అయోధ్యలోని రామమందిరంలో బాలరాముని ప్రాణప్రతిష్ఠ పురస్కరించుకుని జెండాలను ఎగురవేశారు. ప్రతి ఇంటికి జెండాలను పంపిణీ చేశారు.

ఆలయాల ముస్తాబు

నర్వ: శ్రీరామ మందిర ప్రారంభోత్సవం సందర్భంగా మండలంలోని ఆయా గ్రామాల్లోని ఆలయాలను నిర్వాహకులు శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఆలయ ఆవరణ మొత్తం శుభ్రంచేసి ఆలయాలను వివిధ అలంకరణలతో ఏర్పాట్లు చేశారు. సోమవారం ఉదయం 5గంటల నుంచి ఆలయాల్లో పంచామృతాభిషేకం, ఉదయం 9గంటలకు శ్రీసీతా రాములు పూజ కార్యాక్రమాలతో పాటు గ్రామాల పురవీధుల గుండా శోభయాత్ర కార్యక్రమాలుంటాయన్నారు. మధ్యాహ్నం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేస్తామని నిర్వాహకులు పేర్కొన్నారు.



పారిశుద్ధ్యం.. అధ్వానం



వీరన్నపేటలోని పాత ఈద్గా వెనుక గల్లీలో పెద్ద నాలా వద్ద ఇదీ పరిస్థితి

- దెబ్బతిన్న సీసీ రోడ్లు
- కంపు కొడుతున్న పెద్ద నాలా

30వ వార్డులో జనాభా: 6,162
ప్రధాన వీధులు: వీరన్నపేట (కొంత భాగం), రావూఫ్‌సాబ్ దర్గా ఏరియా, ఎర్రమన్నగుట్ట (కొంత భాగం), ఎస్సీవాడ



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక 30వ వార్డులో ఎన్నో సమస్యలు తిష్టవేశాయి. చాలా చోట్ల సీసీరోడ్లు దెబ్బతిన్నాయి. దాదాపు 80 శాతం పాత ఇళ్లే కావడంతో చిన్న డ్రెయినేజీలే దిక్కయ్యాయి. ఈ వార్డు మధ్యలోంచి పెద్ద నాలా ఎప్పుడూ మురుగుతో నిండి దుర్గంధం వెదజల్లుతోంది. దీని చుట్టూ అటూ, ఇటూ ఇళ్లు ఉండటంతో బయటకు రావాలంటేనే ముక్కులు మూసుకునే పరిస్థితి నెలకొంది. వీధులు ఊడ్చడానికి పారిశుద్ధ్య సిబ్బంది సరిగా రారని ప్రజలు వాపోతున్నారు. ఎర్రమన్నగుట్ట ప్రాంతంలో గల్లీలన్నీ అస్తవ్యస్తంగా ఉన్నాయి. సుమారు 40 ఏళ్ల క్రిత పట్టణానికి ఓ మూలన విసిరేసినట్టు గుట్టకు సమీపంలో ఎస్సీవాడ వెలిసింది. ఇక్కడ దొంగల భయం ఉందని స్థానికులు చెబుతున్నారు. ముఖ్య కూడళ్లలోనైనా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. మిషన్ భగీరథ పథకం నుంచి సరఫరా చేస్తున్న తాగునీటిలో ఒండ్రు, నాచు, బురద కలిసి కలుషితమవుతోందన్నారు. దీంతో ఫిల్టర్ నీటిని బయట కొని తాగుతున్నామని పేర్కొంటున్నారు. మూడేళ్ల క్రితం మిషన్ భగీరథ పథకం పైపులైన్ నుంచి ఇంటింటి నల్లాలు తీసుకున్నప్పుడు వీరన్నపేటలోని పాత ఈద్గా వెనుక భాగంలోని పెద్ద నాలా పక్క గల్లీలో సీసీరోడ్డును ఎక్కడికక్కడ తవ్వేశారు. ఈ ప్రాంతంలో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇక కొత్త రైల్వే గేటు నుంచి నీలకంఠ స్వామి ఆలయానికి వెళ్లే మార్గంలో ఓ కూడలి వద్ద చుట్టుపక్కల వారు చెత్తాచెదారం వేస్తున్నారు. దీంతో ఆ ప్రాంతం అపరిశుభ్రంగా తయారైంది.



దెబ్బతిన్న సీసీరోడ్డు



తవ్వి వదిలేసిన సీసీరోడ్డు

కొళాయి బాగుచేయండి



మా వీధిలోని పబ్లిక్ కొళాయిని సుమారు ఏడాది క్రితం కొందరు గుర్తుతెలియని వ్యక్తులు విరగొట్టారు. అక్కడ మిషన్ భగీరథ పథకం ద్వారా వదిలే తాగునీరు పట్టుకునేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీనిని వెంటనే బాగు చేయించాలి. రోడ్లు ఊడ్చడానికి నెలకోసారి పారిశుద్ధ్య సిబ్బంది వస్తారు. డ్రెయినేజీలు శుభ్రం చేసిన వెంటనే ఎప్పటికప్పుడు మురుగు, చెత్తను మున్సిపాలిటీ ట్రాక్టర్‌లో తీసుకెళ్లడం లేదు.
– మలేకాబేగం, చాంద్‌సుల్తానా మసీదు ప్రాంతం

సీసీ కెమెరాలు అమర్చాలి



రావూఫ్‌సాబ్ దర్గా గుట్టకు అతి సమీపంలో సుమారు 70 కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. పట్టణానికి ఓ మూలకు విసిరేసినట్టు కనిపిస్తుంది. ఇక్కడ దొంగల భయం ఎక్కువగా ఉంది. సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తే బాగుంటుంది. మిషన్ భగీరథ పథకం ద్వారా సరఫరా అయ్యే తాగునీటిలో నాచు కలిసి వస్తోంది. దీంతో బట్టలు ఉతుక్కోవడానికి, ఇతర పనులకు మాత్రమే వాడుతున్నాం. ఫిల్టర్ వాటర్ కొనుక్కుని తాగుతున్నాం.
– చిన్న నర్సింహులు, ఎస్సీవాడ, వీరన్నపేట

అధికారులెవరూ పట్టించుకోరు



నేను బీజేపీ నుంచి ఎన్నికైనందున, ప్రతిపక్ష సభ్యుడినని అధికారులెవరూ పట్టించుకోవడం లేదు. ఈ నాలుగేళ్లలో కేవలం రూ.80 లక్షలే కేటాయించడంతో కొన్ని పనులు మాత్రమే పూర్తయ్యాయి. ఎస్సీవాడలో నివసిస్తున్న 70 కుటుంబాలకు ఎస్సీ సబ్ ప్లాన్ నుంచి నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేసినా పాలకపక్షం స్పందించడం లేదు. పెద్ద డ్రెయిన్ దెబ్బతిన్నా మరమ్మతుకు నిధులు ఇవ్వడం లేదు.
– కొల్లి చెన్నవీరయ్య, కౌన్సిలర్, 30వ వార్డు

పోలింగ్ కేంద్రాల పరిశీలన



బాలానగర్‌లో వివరాలపై ఆరాతీస్తున్న అదనపు కలెక్టర్ మోహన్‌రావు

నవాబుపేట: మండల కేంద్రంలో కొనసాగుతున్న ఓటర్ నమోదు స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని ఆదివారం ఆదనపు కలెక్టర్ మోహన్‌రావు పరిశీలించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని 25, 26 పోలింగ్ కేంద్రాలలో కొనసాగుతున్న ఓటరు నమోదు వివరాలపై ఆరాతీశారు. మండల కేంద్రంలో ఓటరు జాబితాలో తప్పులు చాలా ఉన్నట్లు గతంలో ఫిర్యాదులు వచ్చాయని అన్నారు. వాటిని సరిచేయాలని సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ మల్లికార్జున్‌రావు తదితరులు ఉన్నారు.

బాలానగర్: మండల కేంద్రంలోని 78, 79, 80 పోలింగ్ కేంద్రాలను ఆదనపు కలెక్టర్ మోహన్‌రావు ఆదివారం పరిశీలించారు. నమోదు ప్రకియపై బీఎల్‌ఓలను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఓటరు జాబితాలో మరణించిన వారి పేర్లు తొలగించటం, డబుల్ ఓట్ల తొలగింపు వంటివన్నీ సరిచేయాలని సూచించారు.

జితేందర్‌రెడ్డి దంపతులకు సన్మానం



స్టేషన్ మహబూబ్‌నగర్: అయోధ్యలో సోమవారం బాలరాముడి ప్రతిష్ఠాపన కార్యక్రమానికి వెళ్తున్న మాజీ ఎంపీ ఏపీ జితేందర్‌రెడ్డి, రాజేశ్వరి దంపతులను పాలమూరు రెడ్డిసేవా సమితి సభ్యులు హైదరాబాద్‌లో ఆదివారం అభినందించి, సన్మానించారు. ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు తూము ఇంద్రసేనారెడ్డి, ప్రధాన కార్యదర్శి వేపూరి రాజేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షులు జి.వెంకట్రాంరెడ్డి, ప్రచార కార్యదర్శి నలమద్ది సురేందర్‌రెడ్డి, కార్యదర్శి టి.పరమేశ్వర్‌రెడ్డి, కోటేశ్వర్ రెడ్డి, శ్రీనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మల్లురవిని కలిసిన నాయకులు

స్టేషన్ మహబూబ్‌నగర్: ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ అధికార ప్రతినిధిగా నియమితులమైన మల్లురవిని హైదరాబాద్‌లో ఆదివారం జిల్లా కాంగ్రెస్ మీడియా సెల్ కన్వీనర్ సీజే బెనహర్ మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువాతో సన్మానించారు. ఆయన మరిన్ని పదవులు పొందాలని ఆకాంక్షించారు.

నవాబుపేట: మల్లురవిని ఆదివారం మండల కాంగ్రెస్ నాయకులు హైదరాబాద్‌లో కలిసి సన్మానించారు. జిల్లా కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి బంగ్లారవి, నాయకులు ఖాజా, మల్లేష్‌యాదవ్, కృష్ణ, రమేష్ యాదవ్ తదితరులు ఉన్నారు.



రాజకీయ ప్రాధాన్యం కల్పించాలి



నియామక పత్రం అందజేస్తున్న మల్లెపోగు శ్రీనివాస్

మహబూబ్‌నగర్ రూరల్: రాజకీయాల్లో అన్ని సామాజిక వర్గాలకు సమాన అవకాశాలు కల్పించాలని ఎమ్మార్పీఎస్ (టీఎస్) దక్షిణ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు మల్లెపోగు శ్రీనివాస్ అన్నారు. ఆదివారం స్థానిక ఎస్సీ కమ్యూనిటీహాల్‌లో జిల్లా స్థాయి ముఖ్య నాయకుల సమావేశంలో మాట్లాడారు. దళితుల్లో 56 ఉప కులాలతో సహా ప్రతి కుటుంబానికి దళితబంధు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాదిగలకు న్యాయం చేస్తారనే నమ్మకం తమకుందని అన్నారు. జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు వివరించారు. అధ్యక్షుడిగా వై.నరేష్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా యాదయ్య, ఉపాధ్యక్షుడిగా కొత్త మాధవ్, ప్రధాన కార్యదర్శిగా రావుల కృష్ణ, కార్యదర్శిగా శ్రీను, ప్రచార కార్యదర్శిగా సీహెచ్ రాజు, సంయుక్త కార్యదర్శిగా రఘుతో పాటు కార్యవర్గ సభ్యుడిగా జై.హన్మంతులను ఎన్నుకున్నారు. రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జంబులయ్య, ప్రధాన కార్యదర్శి అంజన్న, నాయకులు చెన్నయ్య, వెంకట్, బాలకృష్ణయ్య, రాము తదితరులు పాల్గొన్నారు.

నూతన సంవత్సరం క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్లతో ఎమ్మెల్యేలు అనిరుధ్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, శంకరయ్య తదితరులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: బహుజన క్లాస్ టీచర్స్ అసోసియేషన్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎమ్మెల్యేలు అనిరుధ్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, శంకరయ్యలు ఆదివారం ఆవిష్కరించారు. ఈమేరకు బీసీటీఏ నాయకులు ఉపాధ్యాయుల సమస్యలను వివరించారు. బీసీ ఉపాధ్యాయులకు ప్రమోషన్‌లలో రిజర్వేషన్‌లు కల్పించాలని, బీసీలకు క్రిమిలేయర్ విధానం తొలగించాలని, బదిలీలు, పదోన్నతులను వెంటనే చేపటాలని, డీఎస్సీ వెంటనే వేయాలని, పాఠశాలల్లో వసతులు కల్పించాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో బీసీటీఏ రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణుడు, కోషాధికారి రమేష్, ఉపాధ్యక్షుడు విజయ్‌కుమార్, రాములు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాఘవేంద్ర పాల్గొన్నారు.

మత్స్యపారిశ్రామిక సహకార సంఘం ఎన్నిక

మహబూబ్‌నగర్ న్యూటౌన్: మున్సిపాలిటీ పరిధిలోని చిన్నదర్పల్లిలో మత్స్యపారిశ్రామిక సహకార సంఘాన్ని ఎన్నుకున్నారు. స్థానిక సంఘం కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో అధ్యక్షుడిగా సున్నల యాదగిరి, ఉపాధ్యక్షుడిగా టి.గోవిందు, ప్రధానకార్యదర్శిగా కావలి బాల్‌రాజ్, డైరెక్టర్లుగా టి.లక్ష్మమ్మ, కె.రామలక్ష్మి, బాలకృష్ణ, తిరుపతయ్య, గణేశ్, సత్యమూర్తిలను ఎన్నుకున్నారు. మత్స్యకారుల సంక్షేమానికి కృషి చేస్తానని, ప్రభుత్వం అందించే సంక్షేమ కార్యక్రమాలు అందేలా పని చేస్తానని నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు సున్నల యాదగిరి పేర్కొన్నారు.

ముగిసిన పద్యనాటకోత్సవాలు

స్టేషన్ మహబూబ్‌నగర్: శ్రీపాలమూరు ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని మున్సిపల్ టౌన్‌హాల్‌లో జరుగుతున్న పద్యనాటకోత్సవాలు ఆదివారం ముగిశాయి. శ్రీకృష్ణతులాభారం, శ్రీరామాంజనేయ యుద్ధం నాటకాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో శ్రీపాలమూరు ఆర్ట్ థియేటర్స్ ప్రధాన కార్యదర్శి టి.కృష్ణ పాల్గొన్నారు.



చరిత్రను మలుపుతిప్పిన ఘనత లెనిన్‌దే



నివాళి అర్పిస్తున్న నాయకులు

మహబూబ్‌నగర్ న్యూటౌన్: ప్రపంచ చరిత్రను మలుపు తిప్పిన ఘనత లెనిన్‌దేనని సీపీఎం సీనియర్ నాయకులు కిల్లెగోపాల్ అన్నారు. ఆదివారం సీఐటీయూ జిల్లా కార్యాలయంలో లెనిన్ వర్ధంతి నిర్వహించారు. నాయకులు రామ్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులు నల్లవెల్లి కురుమూర్తి, పద్మ, రాజ్‌కుమార్, ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

జడ్చర్ల: లెనిన్ సేవలు చిరస్మరణీయమని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి సత్తయ్య తెలిపారు.ఆదివారం లెనిన్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.కార్యక్రమంలో నాయకులు కృష్ణయ్య, ఇర్ఫాన్, బొందయ్య, సత్యం, తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల అందజేత



విజేత, రన్నర్ జట్లతో నిర్వాహకులు

దేవరకద్ర: నెల్లికొండిలో ఈ నెల 12న ప్రారంభించిన సల్గుటి రాహుల్‌రెడ్డి స్మారక క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం ముగిసింది. మొత్తం 36 జట్లు టోర్నమెంట్‌లో పాల్గొనగా ఆదివారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో గోపన్‌పల్లి, కోటకదిరా జట్లు తలపడ్డాయి. టోర్నమెంట్ విజేతగా గోపన్‌పల్లి, రన్నర్‌గా కోటకదిరా నిలిచాయి. మొదటి బహుమతి కింద రూ. 25 వేల నగదు, ట్రోఫీని గోపన్‌పల్లి జట్టుకు అందజేశారు. రన్నర్‌గా నిలిచిన కోటకదిరా జట్టుకు రూ. 15 వేల నగదు, ట్రోఫీని అందించారు. ఉమా కృష్ణకుమార్‌రెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షులు నరేందర్‌రెడ్డి, సర్పంచ్ వెంకటేశ్‌యాదవ్, ఉప సర్పంచ్ రుతిరాజ్‌గౌడ్ విజేతలకు బహుమతులను అందజేయగా కార్యక్రమంలో గ్రామ ప్రముఖులు రవీందర్‌రెడ్డి, నందీశ్వర్‌రెడ్డి, రామేశ్వర్ రెడ్డి, దేవేందర్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, మదన్మోహన్ రెడ్డి, తిమ్మారెడ్డి తదతరులు పాల్గొన్నారు.

గురుకుల ఉపాధ్యాయులపై సస్పెన్షన్ ఎత్తివేయాలి



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: గురుకుల ఉపాధ్యాయుల పై వెంటనే సస్పెన్షన్, టెర్మినేషన్ ఎత్తివేయాలని టీఎస్‌యూటీఎఫ్ అనుబంధ సంస్థ టిమ్రీస్ వింగ్ అధ్యక్ష, కార్యదర్శులు రాంబాబు, మహేష్‌లు పేర్కొన్నారు. ఈమేరకు జిల్లా కేంద్రంలోని టీఎస్‌యూటీఎఫ్ కార్యాలయంలో పేద వర్గాలు చదువుకునే అన్ని గురుకులాల్లో సమస్యలు ఒకే విధంగా ఉన్నాయని, అందుకే గురుకులాలన్నింటిని ఒకే గొడుగు కిందకు తీసురావాలని తెలిపారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వెంకటేష్, రవికుమార్, టీమ్రీస్ వింగ్‌నాయకులు శ్రీధర్‌రెడ్డి, కార్యదర్శి జావెద్, పద్మ, శంకర్, రాజేష్‌యాదవ్ పాల్గొన్నారు.

‘మూత’ బడులు తెరుచుకునేనా..?



కనకాపూర్ తండాలో మూతపడిన ప్రభుత్వ పాఠశాల



స్ఫూర్తితండా పాఠశాల

- సర్కార్ నిర్ణయంతో ఆశలు

అడ్డాకుల: జిల్లా పరిధిలో పలు మండలాలు, పట్టణాల్లో మూతబడిన పలు సర్కార్ బడులు మళ్లీ తెరుచుకుంటాయన్న ఆశలు ప్రభుత్వ నిర్ణయంతో చిగురించేలా కనిపిస్తున్నాయి. పలుచోట్ల ఉపాధ్యాయులు లేరని, విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉందని ఇలా అనేక కారణాల వల్ల గత ప్రభుత్వ హయాంలో పాఠశాలలు మూసివేసిన విషయం తెలిసిందే. వీటిలో ప్రధానంగా ప్రాథమిక పాఠశాలలే ఎక్కువగా ఉండడం గమనార్హం. అయితే మరీ ముఖ్యంగా చిన్న చిన్న గ్రామాల్లో పిల్లల సంఖ్య తక్కువగా ఉండటం...వారిలో చాలా మంది ప్రైవేటుకు వెళ్తుండటం పాఠశాలల మూతకు కారణంగా ఉంది. కాగా సింగిల్ టీచర్ పనిచేసే చోట్ల సైతం సదరు ఉపాధ్యాయుడు సెలవు పెడితే ఆ రోజు బడి తెరిచే అవకాశం ఉండడం లేకపోవడం వంటివి కారణంగా మారాయి. దీంతో చాలా పాఠశాలల్లో ఏటా విద్యార్థుల సంఖ్య తగ్గుతూ వచ్చింది. ఫలితంగా మూతబడే పరిస్థితి తలెత్తింది. ఇదిలా ఉంటే ప్రస్తుతం కొలువుదీరిన నూతన ప్రభుత్వం మూతపడిన బడులను తిరిగి ప్రారంభించాలని యోచిస్తోంది. ఇటీవల విద్యాశాఖ సమీక్షలో సైతం సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు జారీ చేసిన నేపథ్యంలో మూతపడిన బడులపై చర్చ సాగుతోంది.

పిల్లలు రావడం లేదని..!

మూసాపేట మండలంలోని కనకాపూర్ తండా, స్ఫూర్తితండాలో ప్రాథమిక పాఠశాలలు గతంలో మూతపడ్డాయి. వీటిని గతంలో చాలా ఏళ్లు సింగిల్ టీచర్‌తో నెట్టుకొచ్చారు. ఈ క్రమంలోనే విద్యార్థుల సంఖ్య తగ్గుతూ పోవడంతో అక్కడ పని చేసే ఉపాధ్యాయులను డిప్యూటేషన్‌పై మరో బడికి పంపే పరిస్థితి నెలకొంది.

అదేవిధంగా స్ఫూర్తితండాలో ఈ ఏడాది 9 మంది విద్యార్థులతో బడి మొదలైంది. ఒకటి, రెండు నెలలు గడిచే సరికి వారిలో చాలా మంది పిల్లలు ఇతర గ్రామాల్లోని ప్రైవేటు బడికి వెళ్లడం మొదలు పెట్టారు. పిల్లల సంఖ్య పూర్తిగా తగ్గిపోవడంతో ఇక్కడ పని చేసే ఉపాధ్యాయుడిని మరో పాఠశాలకు పంపించారు. కాగా ప్రభుత్వం వీటిని తిరిగి ప్రారంభించి.. విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు అవసరమైన వసతులు, బోధన పరమైన చర్యలు చేపడితే పూర్వవైభవం వస్తుందని పలువురు పేర్కొంటున్నారు. ఫలితంగా పేదలకు ఫీజుల మోత తప్పుతుందని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

పిల్లల సంఖ్య తగ్గడంతోనే..

కనకాపూర్, స్ఫూర్తితండాల్లో ప్రాథమిక పాఠశాలలు పిల్లల లేకపోవడంతో మూతపడ్డాయి. కొన్నాళ్ల పాటు పిల్లలు రాకున్నా ఉపాధ్యాయులు నిత్యం బడికి వెళ్లారు. తర్వాత వారిని ఇతర చోట్లకు డిప్యూటేషన్‌పై పంపించాం. పాఠశాలలకు పిల్లలు వచ్చే పరిస్థితి ఉంటే ఉపాధ్యాయుల డిప్యూటేషన్ రద్దు చేసి వారిని యథాస్థానాలకు పంపిస్తాం.
–రాజేశ్వర్‌రెడ్డి, ఎంఈఓ, మూసాపేట